క్లుప్తంగా

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన



గెద్దాడ వారిపాలంలో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

పెనుగొండ: ఆచంట మండలం ఆచంట వేమవరం శివారు గెద్దాడ వారిపాలెంలో జగ్గరాజు కాలువపై వంతెన నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని నాయకులు కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి, కేతా మీరయ్య, జవ్వాది బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల కోసం వాసవీ ధాంలో ప్రత్యేక హోమాలు



వాసవీ శాంతి ధాంలో సైనికుల కోసం ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

పెనుగొండ: దేశ సైనికులకు దైవ రక్షణ ఉండాలని కోరుతూ పెనుగొండలోని అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో ఆదివారం ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఉదయం నుంచి మరకత శిల వాసవీ మాతకు ప్రత్యేక పూజలు, అభిషేకంలు నిర్వహించిన అనంతరం, క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతీ స్వామిజీ(బాల స్వామి) పర్యవేక్షణలో ఆలయ అర్చకుడు శిష్టా మణికంఠ హోమాలు నిర్వహించారు. రుద్ర హోమం, లక్ష్మీ నరసింహహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనరసింహ జయంతి నిర్వహించారు.

ఘనంగా నరసింహుని జయంతి



నరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

యలమంచిలి: మండలంలోని కొంతేరు గ్రామంలో ఉన్న శ్రీ కుంతీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానంలో ఆదివారం నరసింహస్వామి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ బ్రహ్మత్వంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఉదయం స్వామి వార్కి పంచామృతాభిషేకం మధ్యాహ్నం స్వామి వారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం గడియలో శాంతి కల్యాణం సాయంత్రం లక్ష తులసి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. పూజానంతరం భక్తులకు మహదాశీర్వచనం, స్వామి వారి తీర్థ ప్రసాద వితరణ చేశారు.

నేటి నుంచి ప్రతిష్ఠ పూజలు



నూతనంగా నిర్మించిన ఆలయం

కాళ్ల: మండలంలోని జక్కరం గ్రామంలో వేంచేసి యున్న శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ పునః నిర్మాణ విగ్రహాల ప్రతిష్ఠ పూజలు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు శివ పంచాయతన క్షేత్ర అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. 12 తేదీ సోమవారం నాడు గోపూజ, గణపతి పూజ, దీక్షాధారణ, కంకణధారణ,వేద స్వస్తి, మృత్సంగ్రహణం, ఆలయశాలా ప్రదక్షిణ, తదితర ప్రత్యేక పూజలుతో ప్రారంభిస్తామన్నారు. 14వతేది బుధవారం ఉదయం 9.20 గంటలకు త్రయాహ్నిక దీక్షతో శైవాగమశాస్త్ర ప్రకారం పునః నిర్మాణ ఆలయంలో శ్రీరాజ రాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి, శ్రీవిఘ్నేశ్వర స్వామి, శ్రీసూర్యనారాయణమూర్తి, శ్రీ విష్ణుమూర్తి సహిత శివ పంచాయతన క్షేత్రంలో ధ్వజ స్తంభం, పరివార దేవతా విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

శ్రీవారికి తిరుప్పావడ సేవ

భీమవరం(ప్రకాశంచౌక్): జేపీ రోడ్డులోని శ్రీపద్మావతి వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సంప్రదాయబద్ధంగా తిరుప్పావడ సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారి అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేద మంత్రాలతో తిరుప్పావడ సేవ నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు, చైర్మన్ మంతెన రామ్‌కుమార్ రాజు పర్యవేక్షించారు.



నరసాపురం బస్టాండ్ వద్ద ప్రధాన కాలువ దుస్థితి



క్రిస్టియన్ పేట మీదుగా ప్రవహిస్తున్న పంట కాలువలో పేరుకుపోయిన తూడు

పంట కాలువ.. సమస్యల వెల్లువ

- బాగు చేయడం దృష్టి పెట్టని వైనం
- ఇప్పటికీ మొదలు కాని ఓఅండ్‌ఎం పనులు
- వర్షాలు పడితే పనులు అసాధ్యం

ప్రతి ఏటా వేసవిలో ప్రధాన పంట కాలువలు, మురుగునీటి పారుదల కాలువలకు నిర్వహించే ఓఅండ్‌ఎం పనులు ఈ ఏడాది నరసాపురంలో రైతులకు ఉపయోగపడే రీతిలో జరిగేట్టుగా కనిపించడంలేదు. ప్రతిఏటా వేసవిలో రసాయనాల ద్వారా పంట, మురుగు బోదెల్లో తూడు, గుర్రపుడెక్క, నాచు తొలగించడానికి పనులు చేపడతారు. గత ఏడాది ఎన్నికల నేపథ్యంలో ఓఅండ్‌ఎం పనులు చేయలేదు. ఈ ఏడాది కూడా పనుల విషయంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుంది. ప్రస్తుతం మే నెల గడుస్తుంది. త్వరలోనే వర్షాలు పడతాయని వాతావరణశాఖ చెబుతోంది. ఈ పరిస్థితుల్లో పనులు ఎప్పుడు మొదలు పెట్టి, ఎప్పుడు పూర్తి చేస్తారో? అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం నరసాపురం ప్రాంతంలో చాలా చోట్ల పంట, మురుగు కాలువల్లో ఎక్కడ చూసినా తూడు, చెత్త పెరిగిపోయింది. కాలువలు వదిలి, వర్షాలు పడే సమయానికి కాలువలు బాగు చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

– నరసాపురం



మత్స్యపురి వంతెన వద్ద ప్రధాన పంటకాలువలో తూడు పిచ్చిమొక్కలు, గడ్డి



అరుంధతిపేట మీదుగా వెళ్లే ప్రధాన పంటకాలువ పరిస్థితి

వారపు సంత..ట్రాఫిక్ చింత

పెనుమంట్ర: మండలంలో అనేక గ్రామాలలో నిర్వహించే వారపు సంతలు కనుమరుగు అయినప్పటికీ మండల కేంద్రమైన పెనుమంట్ర గ్రామంలో ప్రతీ శనివారం వారపు సంత కొనసాగుతూనే ఉంది. గత పదిహేను ఏళ్ల క్రితం వరకు పెద చెరువుగట్టురోడ్డులోని కనకదుర్గ గుడి వద్ద ఊర చెరువుగట్టున గల పంచాయతీ రోడ్డులో వారపు సంత నిర్వహించేవారు. ఈ వారపు సంతను గ్రామస్తులే కాకుండా మండలంలోని మాముడూరు, పొలమూరు, సత్తా రామేశ్వరం, మల్లిపూడి, జుత్తిగ, వెలగలవారిపాలెం, భట్లమగుటూరు గ్రామాల ప్రజలతో పాటు ఆ రోడ్డున వెళ్లే పరిసర గ్రామాల ప్రజలు కూడా వినియోగించుకునేవారు. అయితే 15 ఏళ్ల క్రితం వారపు సంతను గ్రామపంచాయతీ సమీపంలో స్టేట్‌హైవే రోడ్డుకు మార్పు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్డు మార్జిన్‌లోనే ఈ వారపు సంత నిర్వహిస్తున్నారు. ఈరోడ్డును స్టేట్‌హైవేగా విస్తరించడంతో ట్రాఫిక్ సమస్య జటిలమై ఇటు దుకాణాలు వేసే వర్తకులతో పాటు రోడ్డున వెళ్లే ప్రయాణికులు కూడా ప్రమాదకరంగా మారింది.

షెడ్లను నిర్మించకపోవడంతో..

గతంలో జుత్తిగ, మాముడూరు, పొలమూరు, గ్రామాలలో కూడా గురు, ఆదివారల్లో వారపు సంతలు నిర్వహించేవారు. అయితే అక్కడ వారపు సంతలు కనుమరుగు అవ్వడంతో వారంలో సరుకు అవసరమైన వారు పెనుమంట్రలో శనివారం జరిగే సంతకు వచ్చి సరుకులను కొనుగోలు చేస్తుంటారు. మార్కెట్‌కు తోడు, సంతలో వైన్‌షాపు కూడా ఉండటంతో ప్రమాదాలకు మరింత కారణమవుతుంది. మద్యం కోసం ఆగే వాహనదారులు తమ వాహనాలను రోడ్డుపైనే ఉంచి అటుఇటు వెళుతుండటంతో ప్రమాదాలకు మరింత కారణం అవుతోంది. మార్కెట్‌లో పశువుల చెరువుగట్టు కావల్సినంత ఖాళీ ఉన్నప్పటికీ అక్కడ గ్రామపంచాయతీ షెడ్లు నిర్మించుకోకపోవడంతో వర్తకులు పోటీపడి తమ దుకాణాలను రోడ్ల మార్జిన్‌లోనే ఏర్పాటు చేయడం కొనుగోలుదారుల తమ వాహనాలను దిగకుండానే సరుకులను కొనుగోలు చేస్తుండటంతో రోడ్డుప్రమాదాలకు కారణం అవుతున్నాయి. పశువుల చెరువు గట్టున దుకాణదారులకు షెడ్లను నిర్మించి రోడ్లపై వారపు సంత నిర్వహించకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అలాగే మార్కెట్‌లో సరుకుల కొనుగోలుదారులకు పార్కింగ్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



పెనుమంట్ర వారపు సంతలో వాహనాల రద్దీ



వాహనాలు దిగకుండానే సంతలో కొనుగోళ్లు

షెడ్లు నిర్మించి ఇవ్వాలి



పశువుల చెరువుగట్టును ఎత్తుచేసి, గ్రావెల్‌రోడ్లు వేసి ఇవ్వాలి. వర్షంవస్తే కొనుగోలు దారులకు కూడా ఇబ్బందిగా ఉంది. వర్షాకాలంలో వ్యాపారాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. పన్నులు చెల్లిస్తున్నా మార్కెట్‌లో సౌకర్యాలు మెరుగుపర్చడంలేదు.

–రాగు సత్యనారాయణ, కూరగాయల వ్యాపారి

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ(మీకోసం) కార్యక్రమం యథావిధిగా నిర్వహిస్తున్నట్టు నరసాపురం ఆర్డీఓ దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని పేర్కొన్నారు.

డీసీఎంఎస్ చైర్మన్‌గా చాగంటి

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామానికి చెందిన చాగంటి మురళీకృష్ణ డీసీఎంఎస్ (డిస్ట్రిక్ట్ కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ) చైర్మన్ పదవికి ఎంపికయ్యారు. జనసేన పార్టీకి చెందిన మురళీకృష్ణ ఆక్వా వ్యాపారి.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు

యలమంచిలి: పోడూరు మండలం కవిటం గ్రామంలో బెల్టు షాపుపై దాడి చేసి ఎంసీ రెడ్డి అనే వ్యక్తిని ఆదివారం అరెస్టు చేసినట్లు పాలకొల్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. అతని వద్ద నుంచి 6 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్సైలు పి.మహేష్, జి.రఘు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీలు



భీమవరం: నిఘా విభాగాల సమన్వయంతో జిల్లాలోని బస్ స్టేషన్, రైల్వే స్టేషన్, కీలక ప్రదేశాల్లో విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామని పోలీసు అధికారులు తెలిపారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాల మేరకు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్, పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, లగేజీపై ప్రత్యేక దృష్టి సారించి, క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు.

ప్రమాద బాధితులకు రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలి

యలమంచిలి: మొగల్తూరు గ్రామంలోని నల్లంవారి తోటలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలపై గత నెల 16వ తేదీన మినీ వ్యాను పడిన ఘనటలో కడలి పావని, గుబ్బల గంగాదేవి మృతి చెందారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన గుబ్బల మాణిక్యాలరావు, గుడాల సత్యనారాయణలను భీమవరం ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. మాణిక్యాలరావు పరిస్థితి విషమించడంతో గుంటూరు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. గుడాల సత్యనారాయణ చికిత్స అనంతరం డిశ్చార్జ్ అయ్యి ప్రస్తుతం ఏ పని చేయలేని స్థితిలో ఇంటి వద్దనే విశ్రాంతిలో ఉంటున్నారు. ఘటన జరిగిన వెంటనే వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆందోళన చేపట్టడంతో మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు మాత్రమే ఆర్థిక సహాయం అందించారు. గుడాల సత్యనారాయణ వైద్య చికిత్సకు రూ. 90 వేలు ఉపాధి పథకం ఉద్యోగులు తలా కొంత వేసుకుని ఇచ్చారు. మరణించిన మాణిక్యాలరావుకి వైద్యం అందించే సమయంలో నరసాపురం నుంచి భీమవరం అక్కడి నంచి గుంటూరు ఆసుపత్రులకు, చనిపోయిన తరువాత మళ్లీ మొగల్తూరు తీసుకురావడానికి రూ. 85 వేలు అంబులెన్సు ఖర్చు ఆ పేద కుటుంబమే అప్పు చేసి చెల్లించింది. ఈ నేపథ్యంలో మృతి చెందిన నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ ఆదివారం సీపీఎం నాయకులు పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు కార్యాలయానికి వచ్చి వినతిపత్రం ఇచ్చారు. మృతి చెందిన ప్రతి వ్యక్తికి రూ. 25 లక్షలు, తీవ్రంగా గాయపడ్డ గుడాల సత్యనారాయణకు రూ. 5 లక్షలు ఇవ్వాలని, మరణించిన గుబ్బల మాణిక్యాలరావు కుటుంబానికి రూ. 25 లక్షలు పరిహారంతోపాటు అంబులెన్సు ఖర్చులు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి. బలరాం, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, కన్వీనర్ జవ్వాది శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వైభవంగా గండి పోచమ్మ జాతర మహోత్సవాలు



గండి పోచమ్మవారు

వీరవాసరం: స్థానిక రైల్వే గేట్ సమీపంలో వేంచేసియున్న శ్రీగండి పోచమ్మ 11వ వార్షిక జాతర మహోత్సవాలు అత్యంత వైభవం గా నిర్వహించడం జరుగుతుందని ఆలయ నిర్వహకులు ఆదివారం తెలిపారు. అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. 12వ తేదీ ఉదయం 8 గంటలకు కుంకుమ పూజలు, 11 గంటల నుంచి మేళతాళాలతో, గరగ నృత్యాలతో, తీన్మార్ డప్పులతో, కేరళ వాయిద్యాలతో, బుట్ట బొమ్మలతో బాణసంచా కాల్పులు మధ్య అమ్మవార్ల జాతర మహోత్సవం అత్యంత వేడుకగా నిర్వహిస్తారన్నారు. 13వ తేదీ అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక నైవేద్యాలు సమర్పిస్తారన్నారు. 16వ తేదీ ఉదయం 11 గంటల నుంచి ఆలయ సమీపంలో అఖండ అన్న సమారాధన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు. భక్తులకు పసుపు, కుంకుమ, జాకెట్ ముక్కలు, గాజులు పంపిణీ చేస్తామని ఉత్సవ నిర్వాహకులు పేర్కొన్నారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సహాయం

యలమంచిలి: మండలంలోని చించినాడ పంచాయతీ విప్పర్తి వారి వీధికి చెందిన మురాల బాలాజీ ఎలక్ట్రీషియన్‌గా పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. రెండు నెలల క్రితం పని చేస్తుండగా కరెంట్ షాక్ కొట్టడంతో కొన్ని అవయవాలు పనిచేయడం లేదు. హాస్పిటల్‌లో చికిత్స చేయించుకుని ఇంటికి వచ్చారు. అయినా మాటలు రాకపోవడమే కాకుండా నడవలేకపోతున్నాడు. తన పనులు తాను చేసుకోలేకపోతున్నాడు. అతని భార్య కష్టంతో కుటుంబ పోషణ జరుగుతున్నది. బాలాజీ పరిస్థితి తెలుసుకున్న జై భీమ్ యువసేన ఫౌండేషన్ సభ్యులు బాలాజీకి వైద్య సహాయం, కుటుంబ పోషణ నిమిత్తం ఆదివారం రూ.17,500 ఆర్థిక సహాయం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, మానవతావాది రాయపూడి భవాని ప్రసాద్, తరపట్ల మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



బాలాజీకి ఆర్థిక సహాయం చేస్తున్న జై భీమ్ యువసేన ఫౌండేషన్ సభ్యులు

మాజీ మంత్రి రజినీపై పోలీసుల తీరు దారుణం

పెనుగొండ: మాజీ మంత్రి, బీసీ మహిళా నేత విడదల రజినీపై పోలీసుల తీరు అమానుషమని ఆచంట ఏఎంసీ మాజీ చైర్మన్ సుంకర ఇందిర సీతారామ్ విమర్శించారు. ఆదివారం కొడమంచిలిలో విలేకరులతో మాట్లాడుతూ చిలకలూరి పేటకు చెందిన వైస్సార్ సీపీ నేతను అరెస్ట్ చేయడంపై సీఐ సుబ్బారాయుడుని ప్రశ్నించడంతో సరైన సమాధానం చెప్పకుండా, మహిళ, మాజీ మంత్రి అని చూడకుండా ముందు కారులో నుంచి దిగు లేదా నీ మీద కేసు పెడతానని సీఐ బెదిరించడం ఎంతవరకూ సబబమని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు తెగబడుతుందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాక్షాత్తు మాజీ మంత్రిపైనే ఇలాంటి దాడులకు తెగబడితే రాష్ట్రం ఎటువైపు వెళ్తుందో ఆలోచించుకోవాలని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలం కావస్తున్నా హామీలు నెరవేర్చకపోవడం దారుణమని, దీనిపై మాట్లాడాలని డిమాండ్ చేశారు.



సుంకర ఇందిర సీతారామ్

చలివేంద్రం ప్రారంభం

భీమవరం: స్థానిక భీమవరం సున్ని జామియా మస్జీద్ (పెద్ద మస్జీద్) వద్ద ముస్లిమ్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎండీ అలీషా, జాయింట్ సెక్రెటరీ ఎండీ అస్లంపాషా, జేఏసీ కో–కన్వీనర్ మహబూబ్ పాషా, సయ్యద్ ఫర్హాన్, మగ్బూల్, ఉమైర్, అడ్వకెట్ మునవ్వర్, షేక్ ఫరీద్ బాబా, ముజాహిద్, ఖలీల్, బాబ్జి, హాఫీజ్ మొయిజ్ ఆలం ఫైజీ, యహ్యా మొహిద్దీన్, ఎండీ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి

నరసాపురం: పిల్లలకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాల్సిన అవసరం ఉందని నరసాపురం గ్రేడ్–1 గ్రంథాలయం లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి అన్నారు. గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణా శిభిరంలో ఆదివారం పిల్లలు చేత పుస్తక పఠనం చేయించారు. తరువాత కథలు చెప్పడం, యోగా, లెక్కల సబ్జెక్ట్‌లో మెళుకువలు చేర్పించారు. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిక్షణా శిభిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. మాతృ దినోత్సవం సందర్భంగా అమ్మకు ప్రేమతో పుస్తకాన్ని ఆవిష్కరించి విద్యార్థుల తల్లితండ్రులకు పంపిణీ చేశారు. డాక్టర్ ఎస్ రాజ్యలక్ష్మి, రిటైర్డ్ శాస్త్రవేత్త రంగినీడి సుబ్బారావు, సుదీర్‌మోహన్, చెన్నా లక్ష్మి, పిప్పళ్ల సుప్రజ తదితరులు పాల్గొన్నారు.



అమ్మకు ప్రేమతో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆవును రక్షించిన స్థానికులు

ఆకివీడు: డ్రెయిన్‌లో పడి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఆవును స్థానికులు చూసి ఆదివారం పొక్లయినర్‌తో బయటకు తీశారు. స్థానిక గుమ్ములూరు సెంటర్‌లోని పక్కా డ్రెయినేజీలో ఇటీవల మట్టిని తొలగించారు. దీంతో డ్రెయిన్ సుమారు నాలుగు అడుగుల లోతు ఉంది. అటుగా తిరుగుతున్న రెండేళ్ల వయస్సున్న ఆవు డ్రెయిన్‌లో దిగబడిపోయింది. పొక్లెయిన్ సాయంతో ఆవును వెలికితీసి, ప్రాణాలు కాపాడారు. ఎవరూ చూడకుండా ఉంటే డ్రెయిన్‌లో చనిపోయేదని స్థానికులు చెబుతున్నారు.



ఆవును బయటకు తీస్తున్న స్థానికులు

అనారోగ్య బాధితురాలికి మందుల అందజేత

యలమంచిలి: పాలకొల్లు పట్టణంలోని 23వ వార్డుకు చెందిన బాలి ధనలక్ష్మి ఇంటర్మీడియట్ చదువుతుంది. ఇటీవల ఆ యువతి పాంక్రియాసిస్(క్లోమ గ్రంథి) వ్యాధికి గురవ్వడంతో హైదరాబాద్ ఏఐజీ ఆసుపత్రిలో వైద్య చేయించారు. అయితే పేదరికం వల్ల మందులు కొనలేని స్థితిలో ఆమె ఉండుటతో సహాయం కోసం పాలకొల్లు వాకర్స్ క్లబ్ సభ్యులను సంప్రదించింది. దీంతో వెంటనే స్పందించిన క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు రూ.15 వేల విలువైన మందులను ఆదివారం ఆమెకు అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, సభ్యులు జవ్వాజి కల్యాణ్, బాసిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మందులను అందిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

చిన్నారికి ఆర్థిక సాయం

పాలకోడేరు: మండలంలోని కుముదవల్లిలో గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న వర్షితకు దాతలు సాయం చేశారు. పాలకోడేరు రావిచెట్టు సెంటర్‌లోని తపస్య సూపర్ మార్కెట్ అధినేత గిరిజాల అశోక్‌బాబు, ఎస్సై మంతెన రవివర్మ సమక్షంలో ఆ చిన్నారికి రూ.10 వేలను ఆర్థిక సాయం చేశారు.

వేసవిలో చిన్నారులపై శ్రద్ధ తీసుకోవాలి



చిన్నారికి వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ వంశీ శివరామరాజు

భీమవరం: వేసవిలో పిల్లలు ఎక్కువగా ఎండలో ఉండడం వలన నీరసంగా ఉంటారని, పిల్లల ఆరోగ్యానికి కొన్ని జాగ్రత్తలు పాటించాలని మదర్ నెస్ ఫౌండర్ అండ్ డైరెక్టర్, శిశువు, చిన్న పిల్లల వ్యాధుల సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ వి.వంశీ శివరామరాజు అన్నారు. భీమవరం జేపీ రోడ్డులోని మదర్ నెస్ ఫెర్టిలిటి ఉమెన్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్‌లో ఆదివారం చిన్నారుల కోసం లిటిల్ వెల్ నెస్ క్యాంప్‌ను నిర్వహించారు. వంశీ మాట్లాడుతూ వేసవి వేడి పిల్లలపై ఎక్కువ ప్రభావం చూపుతుందని, అలాంటి వేళ తల్లిదండ్రులు కొన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. వేసవిలో పిల్లలకు డీ హైడ్రేషన్, హీట్ స్ట్రోక్, చర్మ వ్యాధులు వస్తాయని, వైద్యులు సూచించిన జాగ్రత్తలు పాటించడం, పాలు, పండ్ల రసాలు, ద్రవ పదార్థాలు ఇవ్వడం అవసరమన్నారు. అనంతరం చిన్నారులకు ప్రాథమిక ఆరోగ్య చెకప్, పోషణ, ఎత్తు, బరువు, సంపూర్ణ ఆరోగ్య తదితర పరీక్షలను నిర్వహించారు. ఫ్యాన్సీ డ్రెస్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ వంశీ చైతన్య వర్మ, డాక్టర్ కలిదిండి మానస శ్రావ్య, డాక్టర్ ఎ.గోకుల్‌నాథ్, డాక్టర్ పి.సందీప్, చిన్నారులు వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.